క్లుప్తంగా

జననేతకు నీరాజనాలు



స్వర్ణభారతీనగర్, ఇన్నర్ రింగ్ రోడ్డులో తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

గుంటూరు రూరల్: ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలు బుధవారం జననేతకు నీరాజనాలు పలికారు. దారి పొడవునా జైజగన్.. ప్రజా నేత జగన్ అంటూ నినాదాలు చేశారు. రెడ్డిపాలెం లోని ఇన్నర్ రింగ్ రోడ్డుపైకి తరలివచ్చి జననేత జగన్‌కు జేజేలు పలికారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కారు నుంచి దిగి ప్రజలకు అభివాదం చేసి బయ లుదేరారు. అమరావతిరోడ్డు, నగరాలు సెంట ర్లలోనూ ప్రజలు భారీగా రోడ్లపైకి వచ్చి జననే తకు పలికారు.

పాఠశాలలో పిచ్చి మొక్కల తొలగింపు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని చినకోండ్రు పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవర ణలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను బుధ వారం తొలగించారు. ఇటీవల కురుస్తున్న వర్షా లకు మొక్కలు దట్టంగా భవనం ఎత్తు పెరగ డంతో పాఠశాలలోకి విషపురుగులు, పాములు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పోతురాజు లక్ష్మీనారా యణ స్థానికుల సహకారంతో కూలీల ద్వారా జంగిల్ క్లియరెన్స్ చేయించారు.

నేడు పెదకాకానికి కేంద్ర బృందం

పెదకాకాని: అధిక వర్షాలు, వరదల కారణంగా సంభవించిన పంట నష్టాన్ని పరిశీలించేందుకు బుధవారం సెంట్రల్ టీం పెదకాకాని మం డలంలో సందర్శించనున్నట్లు ఎంపీడీఓ బివి మల్లేశ్వరరావు తెలిపారు. పెదకాకాని మండ లంలో గురువారం ఉదయం 9:40 గంటలకు పెదకాకాని రక్షిత మంచినీటి చెరువు, 9:55 గంటలకు పెదకాకాని సమీపంలోని గుం టూరు ఛానల్, 10:10 గంటలకు వెంకటకృష్ణా పురం, దేవరాయబొట్లవారిపాలెం ప్రాంతాల్లో ముంపుకు గురైన పంటపొలాలను సందర్శి స్తారన్నారు. అనంతరం మంగళగిరి, తాడేప ల్లి, తుళ్లూరు మండలాల్లో ఈ సెంట్రల్ టీం సభ్యులు సందర్శిస్తారన్నారు.

డ్రాపౌట్స్‌ని నివారించాలి
సమగ్ర శిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి



ప్రత్తిపాడు: విద్యార్థుల డ్రాపౌట్స్ లేకుండా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష ఏపీసీ జి. విజయ లక్ష్మి అన్నారు. మండల పరిధిలోని తిక్కిరెడ్డి పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపిసి బుధవారం మధ్యాహ్నం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనం తరం పాఠశాలలోని రికార్డులు పరిశీలించారు. రెండు రోజుల కన్నా అదనంగా విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరైతే తల్లిదండ్రులకు ఫోన్ చేసి తమ పిల్లలు ఎందుకు పాఠశాలకు హాజరు కావడం లేదో తెలుసుకోవాలన్నారు. బడి మధ్యలో పిల్లలు మానివేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అలానే మరింత నాణ్యతతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిం చాలని నిర్వాహకులను ఆదేశించారు. ఎప్పటిక ప్పుడు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఎండీఎం నాణ్యతను పరిశీలించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని గ్రామ సచివాల యాన్ని ఏపీసీ తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరి శీలించి, హౌసింగ్ లే అవుట్‌ను సందర్శించారు. వెంట స్థానిక అధికారులు ఉన్నారు.

సంప్రదాయ ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రత్తిపాడు: సంప్రదాయ పద్ధతిలో ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని తినడం ద్వారా సం పూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.మాధవి అన్నారు. పోషణ మాసోత్సవాలలో భాగంగా మండల పరిధి లోని పాతమల్లాయపాలెంలో బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థు లతో కలిసి పోషకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పోషకాహారం ఆవశ్యకత, పోషకాహార లోపం వలన ఎదురయ్యే అనా రోగ్య సమస్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలు, రక్తహీనత.. వంటి పలు విషయాలపై వివరిం చారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో విక్రయించే ఆహార పదా ర్థాలు తినడం వలన జీర్ణకోశ సంబంధిత వ్యాధులు సోకుతాయన్నారు. ఖాళీ నివేశన స్థలాలు ఉన్నవారు ఆకుకూరలు, కూరగా యలు సేంద్రియ విధానం ద్వారా పండించి తినడం వలన బహుళ ప్రయోజనాలుంటాయ న్నారు. అదేవిధంగా చిరుధాన్యాలతో చేసే పల్లీ ఉండలు, నువ్వుల లడ్డూలు, శనగ గుగ్గిళ్లు ఆరోగ్యానికి మంచిదని చెప్పారు. కార్యక్రమం లో హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం బి. శైలజ, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.యమున, బి. స్వాతి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ గలీజు వ్యాపారం

ఆర్టీసీ బస్టాండు అంటే ఎప్పుడూ ప్రయాణికు లతో, బస్సుల రాకతో హడావిడిగా కనిపిస్తుం డాలి. కానీ ప్రత్తిపాడు బస్టాండు తీరు వేరు. ఇక్కడ పైన చెప్పుకున్న ప్రయాణికులు, బస్సులు కానరావు. పేరుకే ఇది బస్టాండు. ఒక్క బస్సు లోపలికి వచ్చి వెళ్లదు. ఈ బస్టాం డుని నమ్ముకుని వ్యాపారం చేయడానికి సిద్ధ పడ్డ వ్యాపారులు ఇవాళ లబోదిబోమంటు న్నారు. ఆర్టీసీ బస్సులు బస్టాండులోని ప్లాటు ఫారాల వద్దకు రాకపోవడంతో పచ్చగడ్డి అంతెత్తున ఏపుగా పెరుగుతోందంటే ఇక్కడి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

- బస్సులు బస్టాండు లోపలకు వస్తాయంటూ చెప్పి టెండర్లలో దుకాణాలు అంటగట్టిన అధికారులు
- నిజమని నమ్మి టెండర్లలో షాపులు దక్కించుకుని లబోదిబోమంటున్న వ్యాపారులు
- బస్టాండులోనికి రాని బస్సులతో వ్యాపారం నిల్
- నెల అద్దె కూడా రాక నెలలుగా దుకాణదారుల అగచాట్లు
- చోద్యం చూస్తున్న ఆర్టీసీ అధికారులు



బస్సులు రాక వెలవెలబోతున్న ప్రత్తిపాడు ఆర్టీసీ బస్టాండు



బస్సులు బస్టాండు లోపలకు రాక, వ్యాపారాలు లేక షట్టర్లు మూసివేసిన దుకాణాలు

ప్రత్తిపాడు: టెండర్ల సమయంలో ఆర్టీసీ అధికారు లు చెప్పిన ముచ్చట్లు నిజమని నమ్మి టెండర్లలో షాపులు దక్కించుకుని నిలువునా మోసపోయారు కొందరు వ్యాపారులు. బస్టాండు లోపలకు బస్సు లు రాక, గల్లా పెట్టెలోకి చిల్లిగవ్వ పడక దుకాణదా రులు పడుతున్న అగచాట్లు అన్నీఇన్నీ కావు. 30 నెలలుగా అద్దెలు కట్టేందుకు వారు పడుతున్న బాధలు, ఆలస్యమైతే రోజుల వారీగా విధించే అపరాధ రుసుములు.. టెండరుదారుల జేబుకు పూడ్చలేని కన్నాన్ని పెడుతున్నాయి. వివరాల్లోనికి వెళితే...

నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని బస్టాండులో ఐదు షాపులు ఉన్నాయి. వాటిలో నాలుగు షాపు లను నెలవారీ అద్దెకు ఇచ్చేందుకు 2022 మార్చి నెలలో ఆర్టీసీ అధికారులు టెండర్లు పిలిచారు. ఒక దుకాణానికి నెలకు రూ.1100, మరో మూడు దుకాణాలకు ఒక్కో దుకాణానికి నెలకు రూ. 1000 చొప్పున టెండర్లు వేసి ప్రత్తిపాడు, నడింపాలెం గ్రామాలకు చెందిన నలుగురు వ్యక్తులు టెండర్లు దక్కించుకున్నారు. ఆయా దుకాణాల్లో బుక్ షాపు, ఫ్యాన్సీ, పాలబూత్, వస్త్ర దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు.

వ్యాపారం లేక అద్దెలు కట్టలేక..

ఆర్టీసీ బస్టాండు లోపలకు బస్సులు రాకపోతుండ టంతో వ్యాపారాలు లేని పరిస్థితి ఉంది. కనీసం నెలకు ఆర్టీసీకి చెల్లించాల్సిన వెయ్యి, పదిహేను వం దల రూపాయలు కూడా వ్యాపారాలు జరగని పరి స్థితి. అద్దెతో పాటు కరెంటు ఛార్జీలు, జీఎస్టీలు కలిపి సుమారుగా ఒక్కక్కరూ రూ. 1500 వరకు నెలకు అద్దె కింద చెల్లించాల్సి వస్తోంది. దీంతో దుకాణదారులు అద్దెలు చెల్లించడంలో కొంత జాప్యం జరుగుతుంది. అయినా ఉపేక్షించని ఆర్టీసీ అధికారులు సకాలంలో అద్దెలు చెల్లించకపోతే రోజుకు రూ. 90 చొప్పున అపరాధ రుసుములు విధిస్తామని హెచ్చరిస్తుండటంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో, 30 నెలలుగా అప్పులు చేసి ఆర్టీసీకి అద్దెలు చెల్లించాల్సి వస్తుందని దుకాణదారులు వాపోతున్నారు.

అద్దె కట్టడానికి కూడా డబ్బులు రావు!



టెండర్లలో బస్టాండులో ఒక షాపుకు దక్కించుకున్నా. ఆ రోజు ఆర్టీసీ వాళ్లు చెప్పిన మాటలకు, ఇప్పుడు వాస్తవ పరిస్థితికి ఏ మాత్రం పొం తన లేదు. అన్నీ మాయమా టలే. కనీసం నెలకు వెయ్యి రూపాయల సరుకు కూడా అమ్మలేని పరిస్థితి. అద్దె చెల్లించడంలో ఒక్కరోజు జాప్యం జరిగినా రోజుకు రూ. 90 ఫైన్ అంటున్నారు.

–రామిశెట్టి ఆదేశ్వరరావు, దుకాణదారుడు,

ఒక్క బస్సు స్టాండ్‌లోకి రాదు!



బస్టాండు లోపలకు బస్సులు వస్తాయన్నారు. బస్సు వచ్చింది లేదు. వ్యాపారం జరిగిందీ లేదు. కానీ నెల నెలా అద్దెలు మాత్రం క్రమం తప్పకుండా చెల్లించాల్సిన పరిస్థితి. ఆర్టీసీ అధికారులు ఒక్కసారి పునరా లోచన చేయాలి. బస్సులు బస్టాండు లోపలకు రానప్పుడు టెండర్లు ఎందుకు పిలవాలి. మమ్మల్ని ఎందుకిలా చేయాలి.

–బి గోవింద్ రెడ్డి, దుకాణదారుడు,

బస్సులు వచ్చేలా చూస్తాం

బస్టాండు లోపలకు బస్సులు వచ్చేలా చూస్తాం. అందుకోసం అక్కడ ఒక కంట్రోలర్‌ను కూడా నియమించాం. సిబ్బంది కొరత వల్ల మళ్లీ కంట్రో లర్‌ను అక్కడి నుంచి తొలగించి వేరే విధులు కేటాయించాం. బస్టాండు మరమ్మతులకు ప్రణాళికలు ఉన్నతా ధికారులకు పంపాం. త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.

–రామకృష్ణారావు, డిపో మేనేజర్, గుంటూరు–1

పార్వతీనందనా.. పాహిమాం...



పెదకాకాని సగరపాలెంలో విఘ్నేశ్వరుని పూజ చేస్తున్న భక్తులు

పెదకాకాని: వినాయక చవితిని పురస్కరిం చుకుని పందిళ్లలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరు నికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. ఈనెల 7వ తేదీన మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో కమిటీలు, యూత్‌ల ఆధ్వర్యంలో పందిళ్లు, ఆలయాల వద్ద ప్రత్యేకంగా పందిళ్లు ఏర్పాటు చేసి విఘ్నేశ్వరుని అలంకరించి ప్రత్యే కంగా పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు తాము ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుని విగ్రహాన్ని పూజల అనంతరం రెండవరోజు నిమజ్జనానికి తరలించారు. మరికొందరు మూడవ రోజు, ఐదవరోజు, తొమ్మిది రోజుల పాటు నిత్య పూజలు చేసి గ్రామోత్సవం, నిమ జ్జనం ఏర్పాటు చేస్తున్నారు. పెదకాకాని సగర పాలెంలోని భగీరథయూత్ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన వినాయక పందిరి వద్ద బుధవారం అన్నసంతర్పణ చేశారు. అలానే నంబూరులో గ్రామోత్సవం అనంతరం గణనాథుని నిమజ్జ నానికి తరలించారు. కార్యక్రమంలో దూపాటి వెంకట్రావు, సుబ్బారావు, మెండాల సోములు, కర్నాటి అయ్యప్ప, నరసింహారావు, గజ్జల వీర భద్రరావు, మల్లయ్య, ముద్రబోయిన నాగేశ్వ రరావు, స్వాతిముత్యం పాల్గొన్నారు.



నంబూరులో నిమజ్జనానికి గణనాథుడు

ప్రయాణం భద్రమేనా?





పొన్నూరు నుంచి రేపల్లెకు వెళ్లే రోడ్డు లోతైన గుంతలతో అధ్వానంగా మారింది. గుంతలతో ప్రమాదకరంగా మారిన రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడి గాయాలపాలైన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించడంలో సంబంధిత అధికారులు పట్టీపట్ట నట్లు వ్యవహరిస్తున్నారు. నిడుబ్రోలు నుంచి డంపింగ్ యార్డు వరకు ఉన్న రోడ్డు అధ్వానం గా ఉండటంతో ప్రయాణానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరి ష్కరించేందుకు రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టడం లేదని ప్రజలు వాపో తున్నారు. నిడుబ్రోలు నుండి రేపల్లెకు వెళ్లే రోడ్డులో వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

–పొన్నూరు



పెదకాకానిలో అభిమాన తరంగం

వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో వై.ఎస్.జగన్‌కు ఘన స్వాగతం

పెదకాకాని: గుంటూరు సబ్ జైలులో ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేష్, విజయవాడ నగర డెప్యూటీ మేయర్ అవుతు శైలజ భర్త శ్రీనివాసరెడ్డి పరామర్శించేందుకు వచ్చిన మాజీ సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి పొన్నూరు నియోజకవర్గ ఇన్‌చార్జి అంబటి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. అం దరికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. ఆయన బుధ వారం గుంటూరు నగరానికి వస్తున్నట్లు సమాచారం అందుకున్న నాయకులు, కార్యక ర్తలు, అభిమానులు పెద్దఎత్తున పెదకాకాని వై జంక్షన్ వద్దకు చేరుకున్నారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, గుంటూరు నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు నియోజకవర్గ ఇన్‌చార్జిలు షేక్ నూరిఫాతిమా, విడదల రజని తదితరులు స్వాగతం పలికారు. దారి పొడవునా యువత, అభిమానులు బైక్‌లతో వెంట కదిలారు. తిరిగి తాడేపల్లి నివాసం వరకూ వైఎస్సార్ యూత్ ఉత్సాహంగా కాన్వాయ్ వెంట సాగింది. వైఎస్సార్ సీపీ జెండాలు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలతో యువత జై జగన్.. జైజై జగన్ అంటూ పెద్దఎత్తున నినా దాలు చేసింది. ఆటోనగర్, గడ్డిపాడు, ఇన్నర్ రింగ్ రోడ్డు మీదుగా గోరంట్ల రోడ్డుకు చేరుకున్నారు.

ఈ సందర్భంగా సాంబిరెడ్డి అనుచరులు, బంధు వులు తమకు టీడీపీ నాయకుల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్న విషయాన్ని వై.ఎస్.జగన్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో అంతా వికలాంగ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధంగా ఉం డాలని వస్తున్న బెదిరింపులపై పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు వివరించారు. పెద్దఎత్తున కార్యకర్తలు వెంట నడిచారు. కార్య క్రమంలో డెప్యూటీ సీఎం డైమండ్‌బాబు, స్థానిక నాయకులు వుయ్యూరు సతీష్‌రెడ్డి, గోళ్ల శ్యాముఖర్జీబాబు, ఆలపాటి రాఘవ, కార్పొరేటర్లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్ర తినిధులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వె. జంక్షన్‌లో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో అంబటి మురళీకృష్ణ

ఎకరానికి రూ.20 వేలు నష్టపరిహారమివ్వాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్

పెదకాకాని: వరదలతో పంట నష్టపోయిన ప్రతి రైతులకు ఎకరానికి 20 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. కాలువ కట్టలకు గండ్లు పడి గత పది రోజులుగా వరి పైర్లు నీటి లోనే మునిగి దెబ్బతిన్న ప్రాంతాల్లో బుధవారం సీపీఎం నాయకులు సందర్శించారు. పెదకాకాని, దుగ్గిరాల, తెనాలి రూరల్ మండల ప్రాంతాల్లో తిరిగి వరి పొలాలను బుధవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. మండలంలోని ఉప్పల పాడు, వెంకటకృష్ణాపురం, నంబూరు, దేవరామ బొట్లవారిపాలెం, తంగెళ్ళమూడి గ్రామల్లో పంట నష్టం జరిగినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ అధిక వర్షాలు, వరదల కారణంగా గుంటూరు చానల్, హైలెవల్ చానల్, మురుగుకాలువ కట్టలు తెగి పొలాలు చెరువులుగా మారాయన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నీరు పొలాల్లోనే ఉండి అందులో మునిగి ఉన్న పైరు కుళ్ళి దెబ్బతిందన్నారు. పం ట కాలువలపై నియంత్రణ లేకుండా అధికారులు పనిచేస్తున్నారన్నారు.



వరిపైరును పరిశీలిస్తున్న రామారావు

ఒక్కో పార్టీకి.. ఒక్కో 'లా'!!

- నిమజ్జనోత్సవాల్లో స్వామి భక్తిని చాటుతున్న పోలీసులు
- ఒక్కో గ్రామంలో ఒక్కోలా నిబంధనల అమలు
- దేవుడి కార్యక్రమాల్లోనూ పోలీసుల ఏకపక్ష వైఖరిపై విమర్శలు

ప్రత్తిపాడు: పోలీసులు స్వామి భక్తిని చాటుతున్నారు. నిమజ్జన వేడుకలకూ రాజకీయ రంగు పులుముతూ పక్షపా తాన్ని చాటుతున్నారు. అధికార తెలుగుదేశం పార్టీ నిమజ్జనా లకు ఒక 'లా', ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ నిమజ్జనాలకు మరో 'లా' అమలు చేస్తున్నారు. దీంతో స్థానికంగా పోలీసుల తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి.

మండల పరిధిలోని పాతమల్లాయపాలెం పంచాయతీ పరి ధిలోని గింజుపల్లివారిపాలెంలో టీడీపీ సానుభూతిపరులు ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాన్ని మంగళవారం మధ్యాహ్నం నిమజ్జనానికి తరలించారు. ఆ సమయంలో తెలుగుదేశం పాటలతో హోరెత్తిస్తూ, నిమజ్జన ట్రాక్టర్‌కు చుట్టూ నాలుగు వైపులా టీడీపీ జెండాలు కట్టుకుని నిమజ్జన ఊరేగింపును నిర్విరామంగా కొనసాగించారు. దీంతో నిమజ్జన వేడుకల్లో పార్టీ జెండాలకు, పాటలకు అభ్యంతరం లేదని భావించిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు అదే రోజు రాత్రి నిర్వహిం చిన వినాయక నిమజ్జన ఊరేగింపులో వైఎస్సార్ సీపీ పాట లతో పాటు జెండాలను ప్రదర్శించారు. విషయం తెలుసు కున్న ఎస్ఐ కె.నాగేంద్ర సీఐ ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ సాను భూతిపరుల నిమజ్జన ర్యాలీ వద్దకు వెళ్లి పార్టీ జెండాలు, పాటలు ఉండకూడదని వెంటనే తొలగించాలని సూచిం చారు. ఒక్క ఐదు నిమిషాల్లో ఊరేగింపును ముగిస్తామని అందుకు సమయం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎస్ఐను కోరారు. అందుకు ఆయన ససేమిరా అనడంతో మహిళలు పోలీసుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సార్ మధ్యాహ్నం మా ఊర్లో ఇదే సెంటరులో టీడీపీ వాళ్లు వాళ్ల పార్టీ జెండాలు, పాటలతో నానా హంగామా చేస్తే ఎందుకు ఆపలేదని, ఇప్పుడు మాపై ఎందుకు ఇలా ఆంక్షలు విధిస్తు న్నారని ప్రశ్నించారు. కొంతసేపు పోలీసులకు మహిళలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఒక దశలో వచ్చే ఏడాది నుంచి మీకు వినాయక చవితికి అనుమతులు ఎలా వస్తాయో చూస్తానంటూ ఎస్ఐ వైఎస్సార్ సీపీ శ్రేణులకు హెచ్చరికలు జారీ చేశారు.

సీఐ గదిలో టీడీపీ నేతలు– ఎస్ఐ గదిలో విగ్రహ కమిటీ సభ్యులు

ఇదిలా ఉంటే బుధవారం సాయంత్రం ఇదే పాతమల్లాయ పాలెంలో మరో విగ్రహ నిమజ్జనం ఉంది. శాంతిభద్రతలు, ముందస్తు జాగ్రత్తల పేరుతో విగ్రహ కమిటీ సభ్యులను సాయంత్రం పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. ఎలాంటి అవాం ఛనీయ ఘటనలు జరిగినా మాదే బాధ్యతంటూ వారి చేత సంతకాలు చేయించుకున్నారు. అయినప్పటికీ వారిని పంప కుండా స్టేషను వద్దనే రాత్రి ఏడు గంటల వరకూ ఉంచారు. పైన అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు సీఐ గదిలో కూర్చుని ఉండగా, సీఐ కిందకు వచ్చి ఎస్ఐ గదిలోకి విగ్రహ కమిటీ సభ్యులను పిలిపించి వారికి సుమారు అర్ధగంట పాటు క్లాస్ పీకి, వార్నింగ్ ఇవ్వడం తీవ్ర చర్చనీయాంశమైం ది. అనంతరం సీఐ తన చాంబర్‌లోకి వెళ్లడం టీడీపీ నాయ కులు బయటకు రావడం జరిగింది. కొన్ని దశాబ్దాలుగా గ్రామంలో గణేష్ ఉత్సవాలు చేస్తున్నా ఎప్పుడూ చిన్నపాటి గొడవలు కూడా జరగలేదని, కానీ పోలీసులు ఇలా ఏకపక్షం గా వ్యవహరించడం దారుణమని వాపోతున్నారు. పోలీసుల తీరుతో రాత్రి ఏడున్నర గంటల వరకు పాతమల్లాయపాలెం లో నిమజ్జనోత్సవం నిలిచిపోయింది.



పాతమల్లాయపాలెంలో టీడీపీ జెండాలతో జరిగిన గింజుపల్లివారిపాలెం వినాయకుని నిమజ్జన ర్యాలీ



వినాయక నిమజ్జన ర్యాలీలో జెండాలు తీసెయ్యాలంటూ వైఎస్సార్ సీపీ శ్రేణులను అడ్డుకుంటున్న ఎస్ఐ నాగేంద్ర

వరద బాధితులకు 'అక్షయ' విరాళం

ప్రత్తిపాడు: విజయవాడలో ముంపునకు గురైన వరద బాధితుల సహాయార్థం ప్రత్తిపాడు అక్షయ విద్యాలయం తమవంతుగా విరాళం అందించింది. రూ. 15 వేల నగదును సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపినట్లు బుధవారం పాఠశాల చైర్మన్ వెలగా రాఘవయ్య చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు.

పెదకాకాని డ్వాక్రా మహిళల విరాళం

పెదకాకాని: విజయవాడ వరద బాధితులకు డ్వాక్రా సంఘాల నుండి 5,59,350 రూపాయలు వసూలు చేసినట్లు డీఆర్‌డీఏ వెలుగు ఏపీఎం బచ్చల రాజు తెలి పారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ సూచనల మేరకు మండలంలోని డ్వాక్రా గ్రూపు సభ్యులు ఒక్కొక్కరి వద్ద నుంచి 50 రూపాయల చొప్పున 1115 మంది వద్ద 5,59,350 రూపాయలు వసూలు చేయడం జరిగిందన్నారు. ఈ నగదు మొత్తాన్ని ఎస్‌జీఎ హెచ్ నుంచి వీఓకి వీఓ నుంచి ఎంఎస్‌కి, ఎంఎస్ నుంచి జిల్లా కలెక్టర్ ఎకౌంట్‌కు పంపించడం జరుగుతుందన్నారు. అనంతరం ఈ నగదు మొత్తాన్ని సీఎం రిలీఫ్‌ఫండ్‌కు పంపించడం జరుగుతుందని బుధవారం రాజు తెలిపారు.